క్లుప్తంగా

కళింగ సేవా సంఘం కార్యవర్గం ఎన్నిక



సంఘం నూతన కార్యవర్గ సభ్యులు

ఆరిలోవ: శ్రీముఖ లింగం కళింగ సేవా సంఘం నూతన కార్యవర్గం ఎన్నికైంది. సేవా సంఘం సమావేశం డెయిరీ ఫారం వద్ద సోమవారం జరిగింది. ఈ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని సభ్యులంతా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా బి.ఎం.నరేష్, అధ్యక్షుడిగా ఎస్.అప్పారావు, ఉపాధ్యక్షుడిగా ఎం.కన్నారావు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఎస్.సంధ్య, కార్యదర్శులుగా పి.రాంబాబు, సీహెచ్.నూకరాజు, ఎల్.సూర్యనారాయణ, కోశాధికారిగా కె.కమలనాభంతో పాటు మరో 11 మంది సభ్యులను నియమించినట్లు ఆర్గనైజింగ్ సెక్రటరీ తెలిపారు.

ఉపాధి, ఉన్నతికి విద్య అవసరం



ప్రసంగిస్తున్న రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్‌స్టీఫెన్

ఏయూ క్యాంపస్: వ్యక్తి ఉన్నతికి, ఉపాధి అవకాశాల కల్పనకు విద్య ఎంతో అవసరమని ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ అన్నారు. సోమవారం ఏయూ మాలవీయ మిషన్ టీచర్ ట్రైనింగ్ సెంటర్‌లో నిర్వహించిన స్టూడెంట్ ఇండక్షన్ ప్రోగ్రాంలో ఆయన పాల్గొన్నారు. ఏయూ సెంటర్ ఫర్ డిస్టెన్స్ అండ్ ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ మాట్లాడుతూ రెగ్యులర్ విద్యకు దీటుగా ఓడీఎల్ శిక్షణ ఉంటుందన్నారు. విద్యార్థులకు అందించే స్టడీ మెటీరియల్‌ను అధ్యయనం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కేంద్రం సంచాలకుడు ఆచార్య కె.విశ్వేశ్వరరావు, ఏయూ ఓఎస్‌డీ ఆచార్య వి.కృష్ణమోహన్, సహాయ సంచాలకుడు ఆచార్య ఎం.వి.ఎస్ చంద్రశేఖర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

అబ్బురపరిచిన అగ్నిమాపక విన్యాసాలు



అగ్నిమాపక శాఖ సిబ్బంది ప్రదర్శిస్తున్న విన్యాసాలు

బీచ్ రోడ్డు: అగ్నిమాపక శాఖ వారోత్సవాల్లో భాగంగా సోమవారం బీచ్‌రోడ్డులో ప్రదర్శించిన విన్యాసాలు అబ్బురపరిచాయి. జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి పి.సింహాచలం ఆధ్వర్యంలో నిర్వహించిన విన్యాసాలు అద్భుతంగా సాగాయి. వాటర్ ట్యాంక్‌తో గాల్లోకి నీటిని వెదజల్లుతూ అందమైన ఆకారంలో నిల్చుని విన్యాసాలను ప్రదర్శించారు. అనంతరం వైఎంసీఏ నుంచి ఆర్కేబీచ్ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. అగ్ని ప్రమాదాల నివారణ చర్యలను వివరిస్తూ ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేశారు.

మంత్రి బొత్సకు 'అప్సా' వినతి

కంచరపాలెం: ఆంధ్రప్రదేశ్ ప్రైవేటు స్కూల్స్ అసోసియేషన్(అప్సా) ప్రతినిధులు సోమవారం రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణను ఆయన నివాసంలో కలిసి పలు సమస్యలపై వినతిపత్రం అందజేశారు. బదిలీ సర్టిఫికెట్లు, స్టడీ సర్టిఫికెట్ లేకుండా ఎవరు ఏ పాఠశాలలోనైనా అడ్మిషన్ పొందవచ్చని ఇటీవల రాష్ట్ర విద్యా శాఖ ఇచ్చిన జీవో ప్రైవేటు స్కూళ్ల యాజమాన్యాలకు నష్టం కలిగించేలా ఉందన్నారు. దీనిపై పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు. మంత్రి బొత్స సానుకూలంగా స్పందిస్తూ ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. అప్సా రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ, ప్రతినిధులు పాల్గొన్నారు.





పార్టీ శ్రేణులతో కలిసి పెదజాలరిపేటలో ఇంటింటి ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ తూర్పు అభ్యర్థి, ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ

హుషారుగా ప్రచారం

- గడపగడపకూ వైఎస్సార్‌సీపీ శ్రేణులు
- ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని పిలుపు

ఆరిలోవ: తూర్పు నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ ఎన్నికల ప్రచారం జోరుగా సాగుతోంది. ఫ్యాన్ గుర్తుకు ఓటేసి విశాఖ ఎంపీగా బొత్స ఝాన్సీలక్ష్మిని, తూర్పు ఎమ్మెల్యేగా ఎంవీవీ సత్యనారాణణను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఇందులో భాగంగా జీవీఎంసీ 19వ వార్డు పెదజాలరిపేటలో సోమవారం వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి, విశాఖ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ ఇంటింటి ప్రచారం చేశారు. పార్టీ కార్యకర్తలతో కలిసి చేపట్టిన ఈ ప్రచారానికి వార్డు ప్రజలు బ్రహ్మరథం పట్టారు. ఇంటింటికి వెళ్లి ప్రచారం చేస్తున్న సమయంలో మహిళలు హారతులు ఇచ్చి ఎంవీవీకి స్వాగతం పలికారు. మహిళలు, వృద్ధులు, యువకులతో ఎంపీ మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్‌మోహన్ రెడ్డి అందించిన సంక్షేమ పథకాలు ద్వారా ఎంత మేరకు లబ్ధి పొందారో ఆరా తీశారు. త్వరలో జరగనున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటేసి తనను ఎమ్మెల్యేగా, బొత్స ఝాన్సీలక్ష్మిని ఎంపీగా గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఎంవీవీ మాట్లాడుతూ ప్రచారానికి వెళ్తున్న ప్రతి ప్రాంతంలోను వైఎస్సార్‌సీపీని ప్రజలు ఆదరిస్తున్నారన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని ప్రజలు కోరుకుంటున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు సూరాడ వెంకటలక్ష్మి, సూరాడ దాస్, వాడమోదుల గణేష్, తదితరులు పాల్గొన్నారు.

బీచ్ రోడ్డు: ఎన్నికల ప్రచారాన్ని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా సాగిస్తున్నారు. ఇంటింటికి వెళ్లి ఐదేళ్లుగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందించిన సంక్షేమాన్ని ప్రజలకు వివరించారు. జీవీఎంసీ 22వ వార్డులో పోలీసు హౌసింగ్ బోర్డు కార్పొరేషన్ డైరెక్టర్ పీతల గోవింద్ ప్రచారం చేశారు.

- జీవీఎంసీ 21వ వార్డులో వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి మధుపాడ రవికుమార్ ఏయూ అవుట్ గేట్ డౌన్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రోడ్డుపై వెళ్తున్న వాహనాదారులకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమం కోసం వివరించారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి మళ్లీ వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చేలా కృషి చేయాలని కోరారు.
- జీవీఎంసీ 28వ వార్డులో కార్పొరేటర్ పల్లా అప్పలకొండ కార్యకర్తలతో ఇంటింటికీ వెళ్లి ఎన్నికల ప్రచారం చేశారు. ఇంటింటికీ వెళ్లి మద్దతు కోరారు.



22వ వార్డులో ఎన్నికల ప్రచారం చేస్తున్న పీతల గోవింద్



వార్డులో ఏయూ డౌన్‌లో ఆటో డ్రైవర్‌కు కరపత్రాలు అందిస్తున్న రవికుమార్



28వ వార్డులో ఇంటింటికి ప్రచారం చేస్తున్న కార్పొరేటర్ పల్లా అప్పలకొండ

అంబేడ్కర్ జీవితాన్ని కళ్లకు కట్టిన నాటికలు



అంబేడ్కర్‌పై విద్యార్థులు ప్రదర్శించిన ఓ నాటికలో సన్నివేశం

ఏయూ క్యాంపస్: సమాజంలో అసమానతలను రూపుమాపే అస్త్రం అంబేడ్కర్ అని విద్యార్థులు నినదించారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చైర్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంత్యుత్సవాలలో భాగంగా సోమవారం ఏయూ ఇంజినీరింగ్ కళాశాల వైవీఎస్ మూర్తి ఆడిటోరియంలో ప్రదర్శించిన లఘు నాటికలు ఆకట్టుకున్నాయి. డాక్టర్ అంబేడ్కర్ జీవితాన్ని, నాటి పరిస్థితులను వేదికపై విద్యార్థులు ఆవిష్కరించిన విధానం ఆలోచింపజేసింది. ముందుగా ఏయూ ఐఏఎస్ఈ విద్యార్థులు విజన్ ఆఫ్ ఇంక్లూజన్ త్రూ ఎడ్యుకేషన్ అంశంతో ప్రదర్శించిన రూపకం అంబేడ్కర్ జీవితం, వివక్ష, అంటరాని తనం, విద్యను ఆయుధంగా మలచుకుని అంబేడ్కర్ ఎదిగిన విధానం కళ్లకు కట్టినట్లు ప్రదర్శించారు. ఏయూ ఫార్మసీ కళాశాల విద్యార్థులు మీరైతే ఏం చేస్తారు అంటూ అత్యన్యూనతను విడనాడాలని, రాజ్యాంగం, ఆశయాలను వివరిస్తూ సాగింది. ఏయూ మహిళా ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థినులు విద్యపై అంబేడ్కర్ ఆలోచనలు వివరించారు. ఏయూ సైన్స్ కళాశాల విద్యార్థులు ప్రదర్శించిన ది విజన్ ఆఫ్ అంబేడ్కర్ రూపకం మహిళా సాధికారత, గ్రామాల్లో సామాజిక మార్పులు ఆవశ్యకతను కళ్లకుకట్టింది. ఏయూ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు ఐపీఎల్, ఆర్‌బీఐ అండ్ అంబేడ్కర్, ఆర్ట్స్ కళాశాల విద్యార్థులు ప్రదర్శించిన మహద్ చెరువు కట్ట, న్యాయ కళాశాల విద్యార్థులు ప్రదర్శించిన సామాజిక న్యాయంతో సమైక్యాభివృద్ధి లఘు నాటికలు అలరించాయి.

కార్యక్రమాన్ని ఉద్దేశించి అంబేడ్కర్ చైర్ ప్రొఫెసర్, రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ మాట్లాడుతూ ఏయూ క్యాంపస్ కళాశాలల విద్యార్థులు రెండు రోజుల్లో వీటిని సాధన చేసి ఎంతో ప్రతిభతో ప్రదర్శించిన విధానం అభినందనీయమన్నారు. విద్యార్థులకు శిక్షణ అందించిన నంది అవార్డు గ్రహీత మహేంద్ర చక్రవర్తిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఓఎస్‌డీ ఆచార్య వి.కృష్ణమోహన్, ప్రిన్సిపాళ్లు ఆచార్య నరసింహారావు, జి.శశిభూషణరావు, టి.శోభశ్రీ, కె.సీతమాణిక్యం, ఎస్.కె.భట్టి, వై.రాజేంద్రప్రసాద్, కె.విశ్వేశ్వరరావు, డీన్‌లు ఎన్.కిషోర్‌బాబు, ఎన్.విజయ్‌మోహన్, టి.షారోన్‌రాజు, కె.బసవయ్య, తదితరులు పాల్గొన్నారు.

సేవామూర్తి సాయిపద్మ మృతికి సంతాపం



సాయి పద్మ (ఫైల్)

ఆరిలోవ: గ్లోబల్ ఎయిడ్ సంస్థ వ్యవస్థాపకురాలు సాయి పద్మ(52) సోమవారం మృతి చెందారు. ఆమె ఆరోగ్యం బాగాలేకపోవడంతో కుటుంబ సభ్యులు నగరంలో ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. పరిస్థితి విషమించడంతో ఆమె ఆస్పత్రిలోనే ప్రాణాలు విడిచారు. సాయి పద్మ ఎంవీపీ కాలనీ సెక్టార్-8లో గ్లోబల్ ఎయిడ్ అనే సంస్థ నిర్వహించి పేదలు, బడుగులకు సేవలు అందిస్తున్నారు. ఇలా ఆమె నగరంలో ఎంతో మందికి సుపరిచితులయ్యారు. సాయిపద్మ తండ్రి డాక్టర్ బీఎస్‌ఆర్ మూర్తి విజయనగరం జిల్లా గజపతినగరంలో ప్రముఖ వైద్యుడు. ఆమె చిన్నతనం నుంచి చదువులో మంచి చురుకుగా ఉండేవారు. చిన్నతనంలో జరిగిన ఓ ప్రమాదంలో ఆమె నడవలేని పరిస్థితికి చేరారు. అప్పటి నుంచి ఆమె వీల్‌చైర్‌కే పరిమితమయ్యారు. ఆమె సేవామూర్తిగా మాత్రమే కాకుండా న్యాయవాది, రచయిత, రీడర్, గాయని, పారా ఎయిర్ రైఫిల్ షూటర్‌గా ఎంతో మందికి పరిచయస్తురాలు. ఆమె మృతి విషయం తెలుసుకున్న ప్రముఖులు, పరిచయస్తులు సంతాపం వ్యక్తం చేస్తున్నారు.

ఆకట్టుకున్న 'నిశ్శబ్దమా నీ ఖరీదెంత' నాటిక



నిశ్శబ్దమా నీ ఖరీదెంత నాటికలో ఓ సన్నివేశం

మద్దిలపాలెం : విశాఖ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో మద్దిలపాలెం కళాభారతిలో జరుగుతున్న రాష్ట్ర స్థాయి నాటిక పోటీలకు విశేష ఆదరణ లభిస్తోంది. సోమవారం ప్రదర్శించిన నిశ్శబ్దమా నీ ఖరీదెంత నాటిక అందర్నీ ఆకట్టుకుంది. విశాఖపట్నంకు చెందిన తెలుగు కళాసమితి సభ్యులు ఈ నాటికను ప్రదర్శించారు.

రెండో నాటికగా విజయవాడకు చెందిన హర్ష క్రియేషన్స్ సభ్యులు స్వర్ణకమలాలు నాటికను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో వీఎండీఏ అధ్యక్ష, కార్యదర్శులు ఎంఎస్ఎన్ రాజు, రాంబాబు, నగదు బహుమతి అందిస్తున్న పైడా కృష్ణప్రసాద్, కె.విజయమోహన్, రామగోపాల్, కె.జి.వేణు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఐఎస్‌టీడీ వ్యవస్థాపక దినోత్సవం



ప్రసంగిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: ఇండియన్ సొసైటీ ఫర్ ట్రైనింగ్ అండ్ డెవలప్‌మెంట్ విశాఖ చాప్టర్ ఆధ్వర్యంలో సంస్థ 54వ వ్యవస్థాపక దినోత్సవం ఆంధ్ర విశ్వవిద్యాలయం టీఎల్ఎన్ సభా మందిరంలో సోమవారం ఘనంగా జరిగింది. ముఖ్యఅతిథిగా వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి మాట్లాడుతూ సంస్థ ప్రగతిని ప్రభావితం చేసే అంశాలు, నూతన విధానాలు, తదితర అంశాలను వివరించారు. సంస్థ సభ్యులను ఈ సందర్భంగా వీసీ అభినందించారు. సంస్థ జాతీయ ఉపాధ్యక్షుడు ఆచార్య ఎస్.సాంబశివరావు మాట్లాడుతూ హెచ్‌ఆర్ నిపుణులకు గొప్ప వేదికగా ఇది నిలుస్తోందన్నారు. విశాఖ ప్రాంతీయ కేంద్రం చైర్మన్ డాక్టర్ ఓ.ఆర్.ఎం.రావు నివేదిక సమర్పించారు. ఈ కార్యక్రమంలో సంస్థ గౌరవ కార్యదర్శి డాక్టర్ హేమ యడవల్లి, ప్రత్యేక అతిథి ఆర్ఐఎన్ఎల్ డైరెక్టర్(ఫైనాన్స్) ఎస్.ఆర్.వి.జి.కె.గణేష్ నిపుణులను తీర్చిదిద్దడానికి ఇటువంటి సంస్థలు దోహదపడే విధానం తెలియజేశారు.

నూకాంబిక అమ్మవారి మారువారం పండగ



పల్లకిలో అమ్మవారి ఊరేగింపు

మద్దిలపాలెం : జీవీఎంసీ 15వ వార్డు సింహాద్రిపురం కాలనీలోని నూకాంబిక అమ్మవారి మారువారం పండగ సోమవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా అమ్మవారికి ఆలయ అర్చకుడు వెంకటాచార్యులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సాయంత్రం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని పుర వీధుల్లో పల్లకిలో ఊరేగించారు. అనంతరం అమ్మవారి నీలాభిషేకం చేశారు.

కల్యాణం.. కమనీయం



తలంబ్రాలు ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్ఠంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం, అక్షింతలు అందజేశారు.

నేడు కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

డాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించనున్న ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. వివరాలకు 0891-2711725, 2566514 నంబర్లకు ఫోన్ చేయవచ్చు.

కొనసాగుతున్న 'ఉక్కు' రిలే దీక్షలు



దీక్ష శిబిరంలో మాట్లాడుతున్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం చేస్తున్న ఉద్యమం భవిష్యత్తు తరాలకు స్ఫూర్తిగా నిలుస్తుందని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు సోమవారానికి 1159వ రోజుకు చేరుకున్నాయి. శిబిరంలో సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు, ఉక్కు నిర్వాసితులు కూర్చుని ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ ఉక్కు నిర్వాసితులు చేసిన ప్రాణత్యాగాలను మోదీ ప్రభుత్వం గుర్తు చేసుకోవాలన్నారు. స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయిస్తే ఉత్పత్తిలో పరుగులు పెడుతూ దేశంలో నెంబర్ వన్ పరిశ్రమగా ఎదుగుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆ దిశగా చర్యలు చేపట్టాలని, ఇప్పటికైనా పరిశ్రమను ప్రభుత్వరంగ సంస్థగానే కొనసాగిస్తామనే ప్రకటన చేయాలని కోరారు.

ఎన్నికల వ్యయం పక్కాగా లెక్క

- నామినేషన్ నాటి నుంచి అభ్యర్థుల ఖాతాల నిర్వహణ
- పార్టీల ప్రతినిధులతో తూర్పు ఆర్వో, జేసీ మయూర్ అశోక్



తూర్పు నియోజకవర్గంలో నాయకులతో మాట్లాడుతున్న తూర్పు ఆర్వో మయూర్ అశోక్

మహారాణిపేట: ఎన్నికల వ్యయానికి సంబంధించి పోటీ చేసే అభ్యర్థులు పక్కా రిజిస్టర్లు నిర్వహించాల్సి ఉంటుందని విశాఖ తూర్పు నియోజకవర్గ ఆర్వో, జిల్లా జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ అన్నారు. స్థానిక కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం సాయంత్రం తూర్పు నియోజకవర్గ ప్రతినిధులతో జరిగిన సమావేశంలో జేసీ మాట్లాడారు. నామినేషన్లు వేసిన రోజు నుంచి అభ్యర్థుల ఖాతాల్లో వ్యయానికి సంబంధించిన వివరాలను నమోదు చేస్తామన్నారు. ఎన్నికల నిర్వహణ, నామినేషన్లు, ప్రచారాలకు సంబంధించిన ప్రతి అంశంపైనా రాజకీయ పార్టీల ప్రతినిధులకు అవగాహన అవసరమన్నారు. నిబంధనలు అనుసరించి అనుమతులు తీసుకుని ప్రచారాలు చేసుకోవాలన్నారు. అభ్యర్థులు తాజాగా బ్యాంకు ఖాతా తెరవాలని, దాని ద్వారానే ఎన్నికల వ్యయానికి సంబంధించిన లావాదేవీలు జరపాలని జేసీ స్పష్టం చేశారు. ఈ నెల 18న నోటిఫికేషన్ వెలువడుతుందని, అప్పటి నుంచి పూర్తి స్థాయి ఎన్నికల ప్రక్రియ మొదలవుతుందని చెప్పారు.

క్రిమినల్ కేసుల వివరాలు ప్రకటించాలి

క్రిమినల్ కేసులున్న వారు మూడు సార్లు పత్రికల్లో సంబంధిత వివరాలను తెలియజేస్తూ ప్రకటన ఇవ్వాల్సి ఉంటుందని జేసీ తెలిపారు. నామినేషన్ ధరావతు రూ.10వేలు చెల్లించాలని, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.5వేలు రాయితీ ఉంటుందని వెల్లడించారు. నామినేషన్లకు సంబంధించి అన్ని వివరాలను సక్రమంగా పూరించాలని, తప్పులు దొర్లకుండా చూసుకోవాలని సూచించారు.

మే 1న రెండో విడత ర్యాండమైజేషన్

మే ఒకటో తేదీన ఈవీఎంల రెండో విడత ర్యాండమైజేషన్ జరుగుతుందని, 5, 6వ తేదీల్లో రెండో దశ శిక్షణ కూడా మొదలవుతుందని రాజకీయ పార్టీల ప్రతినిధులకు జేసీ వివరించారు. మే 13న పోలింగ్ జరుగుతుందని, ఆ రోజు ఉదయం 5.30 గంటలకే పోలింగ్ ఏజెంట్లు కేంద్రానికి హాజరు కావాలని సూచించారు. ఆ రోజు ఉదయం 7.30 గంటల్లోపు మాక్ పోలింగ్ నిర్వహిస్తామన్నారు. కీలకమైన అన్ని దశల్లో రాజకీయ పార్టీల నుంచి పూర్తి సహకారం ఉండాలని, ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. షెడ్యూల్ నుంచి ఎన్నికలు పూర్తయ్యే వరకు జరిగే ప్రతి దశపైనా జేసీ ఈ సందర్భంగా వివరించారు. ఈ సమావేశంలో తూర్పు నియోజక వర్గ ఎన్నికల అధికారులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా పోలమాంబ అమ్మవారి రాట ఉత్సవం



సంజయ్‌గాంధీ కాలనీ పోలమాంబ అమ్మవారి రాట ఉత్సవంలో పూజలు చేస్తున్న మేయర్ గొలగాని

ఆరిలోవ: జీవీఎంసీ 9వ వార్డు సంజయ్‌గాంధీ కాలనీలో పోలమాంబ అమ్మవారి ఆలయ ప్రాంగణంలో సోమవారం రాట ఉత్సవం వేడుకగా నిర్వహించారు. పోలమాంబ అమ్మవారి ఉత్సవాలు ఈ నెల 19 నుంచి 23 వరకు జరగనున్నాయి. ఈ మేరకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన రాట ఉత్సవంలో ముఖ్యఅతిథిగా మేయర్ గొలగాని హరివెంకటకుమారి పాల్గొని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్త కె.నాగరాజు మాట్లాడుతూ ఈ నెల 23న అమ్మవారి పండగ సందర్భంగా పరస జరుగుతుందన్నారు. అమ్మవారి మాల ధరించినవారు అగ్ని గుండం తొక్కడంతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు ఒమ్మి రాజు, కార్యదర్శి తాతారావు, సభ్యులు ఈశ్వరరావు, హరినాథ్, అప్పారావు, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

పెదగదిలిలో శ్రీరామ నవమి ఉత్సవ రాటలు

పెదగదిలిలో పలు చోట్ల శ్రీరామ నవమి కోసం రాట ఉత్సవాలు సోమవారం నిర్వహించారు. ఈ నెల 17న శ్రీరామ నవమి వేడుకలు జరగనున్నాయి. ఇందు కోసం 12వ వార్డు పెదగదిలి ప్రాంతంలో శ్రీకృష్ణా యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో రాట వేశారు. పెదగదిలి ప్రాంతం సింహగిరి కాలనీలో కూడా శ్రీరామనవమి కోసం రాట ఉత్సవం నిర్వహించారు.

వైఎస్సార్‌సీపీ గెలుపునకు సైనికుల్లా పనిచేద్దాం




మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ తూర్పు అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ, చిత్రంలో ఎంపీ బాబూరావు

- ఎంపీలు గొల్ల బాబూరావు, ఎంవీవీ పిలుపు
- 16వ వార్డులో మేము సిద్ధం సభ

మద్దిలపాలెం : రాష్ట్రంలో పేదల జీవితాల్లో వెలుగులు నింపిన సంక్షేమ ప్రదాత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ అధికారంలోకి తీసుకురావడానికి ప్రతి కార్యకర్త ఒక సైనికుడిలా పని చేయాలని రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు, విశాఖ ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ పిలుపునిచ్చారు. జీవీఎంసీ 16వ వార్డులో మేము సిద్ధం మా బూత్ సిద్ధం సభ ఇసుకతోట రజకవీధిలో సోమవారం పార్టీ తూర్పు నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు మొల్లి అప్పారావు ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐదేళ్లలో రాష్ట్రంలో సీఎం జగన్ ప్రవేశపెట్టిన పథకాల గురించి క్షేత్రస్థాయిలో ప్రతి ఒక్కరికీ తెలియజేయాలన్నారు. ముఖ్యమంత్రిగా మళ్లీ జగన్ననే ప్రజలు ముక్త కంఠంతో కోరుకుంటున్నారన్నారు. తూర్పు నియోజకవర్గంలో ఐదేళ్లలో అమోఘమైన అభివృద్ధి జరిగిందన్నారు. ఏ కాలనీ చూసిన కొత్త తారురోడ్లు, సీసీ రహదారులతో కళకళలాడుతున్నాయన్నారు. పిల్లలు, పెద్దలు సేదతీరేందుకు పార్కులను ఆధునీకరణ చేశామన్నారు. తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకున్నామని చెప్పారు. ప్రజలకు అందుబాటులోకి ఉచిత వైద్యం కోసం వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఎలాంటి అర్హత లేని పవన్ కల్యాణ్ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిపై అవాకులు, చవాకులు పేలుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వారికి ప్రజలే ఓట్లతో బుద్ధి చెబుతారన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి పి.నారాయణ, ఎస్సీ విభాగం నాయకుడు అల్లంపల్లి రాజబాబు, మత్స్యకార నాయకుడు గంటల వెంకట రామచంద్రరావు, చొల్లంగి నాగేశ్వరరావు, క్లస్టర్ అధ్యక్షులు, వార్డు అధ్యక్షులు, మహిళా నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వైభవంగా ప్రపంచ చిత్రకళా దినోత్సవం



ప్రదర్శన తిలకిస్తున్న ప్రిన్సిపాల్ నరసింహారావు

ఏయూ క్యాంపస్: కళాకారుల్లో సృజనాత్మకత అధికంగా ఉంటుందని ఏయూ ఆర్ట్స్ కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య నరసింహారావు అన్నారు. సోమవారం ప్రపంచ చిత్రకళా దినోత్సవాన్ని ఏయూ ఫైన్ ఆర్ట్స్ విభాగంలో వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక మిల్లెట్ ఆర్ట్ ప్రదర్శనను ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ విభిన్న రూపాల్లో చిత్రకళ విరాజిల్లుతోందని, ప్రజల్లో ఆరోగ్య అవగాహన కలిగిస్తూ మిల్లెట్స్‌తో సహజసిద్ధంగా తీర్చిదిద్దిన చిత్రాలతో ఏర్పాటు చేసిన ప్రదర్శన ఎంతో ప్రత్యేకమని ప్రశంసించారు. కళకు కాదేదీ అనర్హం అన్న విధంగా చిరుధాన్యాలను ఉపయోగించి తీర్చిదిద్దిన కళారూపాలు ఎంతో ప్రత్యేకతను చాటుతున్నాయన్నారు. మిల్లెట్స్ ఆర్టిస్ట్ మోకా విజయ్‌కుమార్‌ని ప్రత్యేకంగా అభినందించి సత్కరించారు. ఈ ప్రదర్శన ఏర్పాటు చేసిన విభాగాధిపతి డి.సింహచలంను ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో విభాగ అధ్యాపకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.